# కళాసాగర్

22వ వార్షికోత్సవ సంచిక. 1994



కథ:

# రససిద్ధి

"సార్ ..."

"ఎస్ ... " తలెత్తి చూశాడు సాగర్.

"విన్నాను .." "కృష్ణమాచారిగారు చావు బ్రతుకుల మధ్య ... "

"నిన్న మీరు ... ఆయనకు ప్రమాదస్థితి వస్తే కబురు చెయ్యమని ...

ఉలిక్కి పడ్డాడు సాగర్ "ఎస్ ... ఎస్ ... యు ఆర్ రైట్ ఓ..కే.... మీరు వెళ్లండి" ... అన్నాడు. చల్లటి ఎ.సి రూం.. ఇన్‌డోర్‌ప్లాంట్స్ .. బుర్ర మాత్రం వేడెక్కి పోతోంది సాగర్‌కు.

ఫోన్ చేసి తెలుసుకున్నాడు .. తనకు తెలిసిన కృష్ణమాచారి – వీరూ ఒకరేనా ?
ఒకరే .. కన్‌ఫర్మ్ అయింది.

నిట్టూర్చాడు సాగర్ ... కళ్లు మూసుకుని ఆలోచిస్తున్నాడు ..

దండ వేసిన తండ్రి ఫోటో వంక చూశాడు. "ఊరికి దూరంగా స్టూడియో కట్టానంటే కారణాలు చాలా ఉన్నాయి.. రైలు ఇంజన్ యజమానికి బొగ్గు మోసే కూలీ పరిస్థితి అర్థమవ్వాలి ... ముందు 'సి' టైపు కార్మికుల్ని గుర్తించు. కూడు, గుడ్డ, నీడ టెన్షన్ లేకుండా చెయ్యి ... మేకప్ మెటీరియల్, పిన్నీసులు దగ్గర నుంచి దొరికే ఏర్పాట్లు ప్రారంభించు.. అవసరాలు వేరు ఆడంబరాలు వేరు.. అవసరాలు నువ్వు కల్పించలేవు .. అవి ఏర్పడాలి. ఆడంబరాలు నువ్వు కొనగలవు ... గుర్తు పెట్టుకో ..."

ఎం.బి.ఎ పాసై వచ్చిన సాగర్‌కు స్టూడియో మేనేజ్‌మెంటు అప్పచెపుతూ తండ్రి చెప్పిన మాటలివి. ఇవేకాదు .. ఇంకా ఎన్నో చెప్పాడు .. చదువు లేకుండా గొప్ప బిజినెస్‌మాన్ అయిన తండ్రి మాటలు చాదస్తంగా మొదట్లో కనబడ్డా ఆ తరవాత "అనుభవం" ముందు "చదువు" ఆగదని అర్థమైంది సాగర్‌కు.

"డబ్బు నేనిక్కడున్నాను అని చెపుతుంది .. వినే చెవులుండాలి... అంతే ... ప్రతి మనిషికీ, ప్రతి ఎమోషన్ కూ ఏదో ఒక రూపంలో ఖరీదు ఉంటుంది. కొనెయ్ ... సెంటిమెంట్స్‌ను గౌరవించు .. అవి నీకు గౌరవం తెచ్చినన్నాళ్లూ ఆచరించు .. అభాసుపాలు చేస్తుందన్న భయముంటే .. వెంటనే ఒదిలెయ్ .. దయ,జాలి, ప్రేమ ... అవి ఎదటి వాడు నీమీద చూపించేటట్లు చూసుకో .... నీకు మాత్రం అవి ఓవర్ డ్రాఫ్ట్ .... జాగ్రత్తగా ఉపయోగించాలి."

ఇలా చాలా జీవిత సత్యాలు నేర్చుకుంటూ ఎదుగుతూ పైకి వచ్చాడు సాగర్... స్టూడియో, హాస్పిటల్, రెస్టారెంట్స్ .... ప్రతి మాటా, ప్రతి కదలిక - "పెట్టుబడి" అనే స్థితికి వచ్చాడు... తన కింద పనిచేసే అందరికీ, యోగా తరగతులు పెట్టించాడు; కోపరేటివ్ సొసైటీ తరపున రేషన్స్ ఏర్పరిచాడు.

"వాళ్ల టెన్షన్, మన పరిశ్రమకు నష్టం ...." అనే తండ్రి మాట ఎప్పుడూ గుర్తుండేది అతనికి. వాళ్లకు "సెల్ఫ్ హెల్ప్" క్లాసెస్, లెక్చర్సు ఏర్పరిచేవాడు. అప్పుడప్పుడు తను కూడా వెళ్లి కూర్చునేవాడు.. కానీ, ఎందుకో... మెడిటేటివ్ స్టేజ్ .... ఆ ధ్యాన స్థితికి వెళ్లలేకపోయేవాడు. అతని మెదడు అందాక వెళ్లి, ఆ తలుపు తెరవలేకపోయేది... కళ్లు తెరిచి అందర్నీ పరీక్షిస్తూ కూర్చునేవాడు...

*"డబ్బు నేనిక్కడున్నాను అని చెవుతుంది .. వినే చెవులుండాలి... అంతే ... ప్రతి మనిషికీ, ప్రతి ఎమోషన్ కూ ఏదో ఒక రూపంలో ఖరీదు ఉంటుంది. కొనెయ్"*

అతని టేబుల్ మీద - "of course I am selfish .... I will make you happy because I will be happy ...." అనే కొటేషన్ ఉండేది. సాగర్‌కు, అతని చుట్టుపక్కల ప్రపంచంలో, అతని బిజినెస్ ప్లేసెస్‌లో చాలా చోట్ల అడ్మైరర్స్ ఉండేవాళ్లు. అతనికి ఎక్కడా అపజయం లేదు... అతనికి ప్రతి ఎమోషనల్ అటాచ్‌మెంటు ఖరీదు తెలుసు కాబట్టి, భార్య, పిల్లలు, తల్లి, చెల్లెళ్లు, పనివాళ్లు, గర్ల్‌ఫ్రెండ్స్ ఎవరినీ అసంతృప్తిగా ఉంచేవాడు కాదు.....

అతనికి ఎక్కడా అపజయం లేదు.. ఒక్క ధ్యానం ప్రశాంతత విషయంలో తప్ప.. అది ఎందుకు రాదో, ఎలా వస్తుందో అతనికి శేషప్రశ్న.

ఒకనాడు తండ్రి ఏదో కళాకారుల సన్మాన సభకు అధ్యక్షత వహించడానికి వెళుతూ,

"కళాకారులకు శాలువా, సన్మానం, చప్పట్లు ఇవి చాలు సాగర్..... నేనిప్పుడు సన్మానం చెయ్యబోయే వాళ్లంతా ఎవరో నాకే సరిగ్గా తెలియదు. అక్కడ ఆర్గనైజర్లు బయోడేటా అదీ ఇస్తారనుకుంటా"... అంటూ వెళ్లాడు.

డ్రైవర్ ఉన్నట్లుండి సెలవు అడగ్గానే తండ్రిని తీసుకురావడానికి తనే వెళ్లాడు సాగర్...

అప్పటికే థియేటర్ అంతా ఖాళీగా ఉన్నది.... 'అరె ఆలస్యం అయిందా?' అనుకుంటూ వెళ్లాడు సాగర్... తండ్రి, ఒక పక్కన, వెన్నెల్లో తల పక్కకు వాల్చి కూర్చుని ఉన్నాడు.

"నాన్నా! సారీ... ఆలస్యమైందా?... మిమ్మల్ని ఎవరైనా డ్రాప్ చేసేవారుగా" ... గబగబా దగ్గరకు వెళ్లాడు సాగర్.

ఆయన తలెత్తి చూశాడు.

విచిత్రంగా తండ్రి కళ్లలో నీరు....

"కన్నీరు చాలా ఖరీదైందిరా అబ్బాయ్... అనవసరంగా ఎవరూ గుర్తించనప్పుడు, ప్రయోజనం లేనప్పుడు పల్లిగ్గా ఏడవకు...." అనే తండ్రి ఏమిటిలా......

"నాన్నా!....ఏమైంది......."' తండ్రి భుజాల చుట్టూ చేతులు వేస్తూ అన్నాడు సాగర్.

మౌనంగా కార్లో కూర్చున్నాడు తండ్రి...

'నాన్నా! ఒంట్లో బాగాలేదా? హాస్పిటల్‌కు..' "సాగర్".... తండ్రి గొంతు విచిత్రంగా వినబడింది. "కన్నీరు కార్చడం, కన్నీరు రావడం ... వ్యాధికాదు నాన్నా...అదొక అనుభూతి.... ఇవ్వాళ ఆ సన్మానాల తరవాత,... కృష్ణమాచారి అని ఎవరో స్టేజ్ ఆర్టిస్ట్ ...ఒకసీను చేశాడు సాగర్.... 'నన్ను...నన్నుగా గుర్తించరేం.. నేను మీకేమిటి? అని కాదు.. నేను..నేనుగా ఎవర్ని...?' ఈ డైలాగులు ఒక గొప్ప మాడ్యులేషన్‌తో ఒక, అద్భుతమైన మెళకువతో... అదిరిపోయింది సాగర్.... నువ్వు మిస్సయ్యావు... నేను ఇన్ని డ్రామాలు చూశాను కానీ ఆ తాదాత్మ్యత, ఆ.... దాన్నేమంటారు... రససిద్ధి..... అతను...

జలంధర

అతను ఆడియన్స్‌ను, తన స్థితికి పట్టుకు వెళ్లిపోయాడు సాగర్... ప్రతి ప్రేక్షకుడు, తనను తాను ఆ ప్రశ్న వేసుకునే స్థితికి తీసుకువెళ్లాడు... మనం స్టార్స్‌లో మిస్ అయ్యేదీ ఆర్టిస్టులో చూసేదీ... అదేదో ... సూపర్బ్...."

అవాక్కై విన్నాడు సాగర్... ఇదేదో ఓల్డేజ్‌లో వచ్చే సెనిలిటీ కాదుకదా అని భయమేసింది..

స్వయంగా తండ్రికి ఒక వాలియం మాత్ర ఇచ్చి పడుకోపెట్టాడు... ఆ తరువాత తండ్రి కృష్ణమాచార్య డ్రామా ఎక్కడున్నా వీలు చూసుకుని వెళ్లేవాడు.

తండ్రి పోయి రెండేళ్లయింది...

కాకతాళీయంగా, తెలిసింది తన హాస్పిటల్‌లో ఆర్టిస్ట్ కృష్ణమాచార్య అడ్మిట్ అయ్యాడని. అతను, తండ్రి అభిమానించే వ్యక్తి ఒకరేనా అని తెలుసుకుందామనుకున్నా,

పనుల వత్తిడి....

* * *

ఇప్పుడు ఎంక్వైరీ మీద తెలిసింది.... ఏం చెయ్యాలి? మెల్లిగా హాస్పిటల్ వైపు కారు మళ్లించాడు.. అక్కడ,

సరిగ్గా, 'సమాధికడతాం చందాలివ్వండి' - లాంటి దృశ్యాలు:

సిగరెట్లు తాగుతూ, కిటికీలకు చేరబడి, ఆయనతో తమ నాటకానుభవాలు చర్చించేస్తున్నారు కొందరు. ఒకల్లిద్దరు పత్రికలవాళ్లకు చెప్పేస్తున్నారు. బావమరిది ఇన్స్యూరెన్స్ పేపర్ల సంగతి విచారిస్తున్నాడు. కళాకారుల సంఘం నుంచి విరాళం తెస్తాము సంతకాలు చెయ్యండి అంటున్నారు, కొందరు ఆయన భార్యను... వృద్ధురాలైన ఆయన తల్లి, కుర్చీలో కాలు ముడుచుకుని, కర్రచేత పట్టుకుని కూర్చుంది. ఆమెగాజుకళ్లు వచ్చే పోయే జనాన్ని పరిశీలిస్తున్నాయి.

ఇద్దరు ముగ్గురు కుర్రాళ్లు ఆవేశంగా అటూ ఇటూ తిరుగుతున్నారు.... రోజాపూవుల దండల గురించి చర్చలు.

గందరగోళంగా ఉన్నది అయిన వాళ్లు, అభిమానులు, హాస్పిటల్ వాళ్లు - అందరూ ఆయన మృత్యువుకోసం ఎదురు చూస్తున్నారు.

మెల్లిగా డాక్టర్ దగ్గరకు వెళ్లి విషయం కనుక్కొన్నాడు సాగర్.

హాస్పిటల్ ఓనర్‌గారే స్వయంగా వచ్చి అడిగేటప్పటికి, చాలాగొప్పగా ఫీలైపోయాడు డాక్టర్...

రిపోర్టులన్నీ విన్న తరువాత ఆయన పరిస్థితి అంత ప్రమాదకరంగా లేదు కానీ, ఎవరూ ఆయన బ్రతుకుతారని అనుకోవడం లేదు..... అర్థమైంది సాగర్‌కు.

'ఆయన బ్రతకాలని కాదు... బ్రతికించుకోవాలన్న ఉద్దేశ్యంలేదు'... మనసు చెపుతోంది...

అప్రయత్నంగా లోపలికి అడుగువేశాడు సాగర్...

కళ్లు మూసుకుని పడి ఉన్న ఆ వ్యక్తి ......

"కదలిక...మాట...అన్నీ... అన్నీ .... రసాన్ని వ్యక్తపరుస్తాయి సాగర్..." అన్న తండ్రి మాటలు గుర్తుకువచ్చాయి.

"డాక్టర్... ఈయన బ్రతకరంటారా?" కృష్ణమాచార్య అర చేతిలో చెయ్యివేస్తూ అన్నాడు సాగర్.. చిన్న కదలిక..

డాక్టర్ బిత్తరపోయాడు, పేషెంటు ఎదురుగా అదేం ప్రశ్న అని.

" వీరిని మీరు ఎలాగైనా బ్రతికించాలి డాక్టర్... ప్లీజ్... నా స్టూడియోకు అనుబంధంగా

***"మనందరం నటులమే... ప్రతిరోజూ ప్రతి ఒక్కళ్ల దగ్గరా ప్రతిక్షణం నటిస్తూనే ఉంటాము..."***

యాక్టింగ్ స్కూలు పెడుతున్నాను... వీరిని వీరిని ప్రిన్సిపాల్ చెయ్యాలనుకున్నాను... మహా కళాకారుడైన ఈ వ్యక్తి.... ఈ వ్యక్తి .... తన ఎమోషనల్ జెస్చర్స్‌తో, ఇన్‌వాల్వ్‌మెంటుతో రాతి మనుష్యుల్ని కూడా... ఎక్కడో నిద్రిస్తున్న అంత: చైతన్యాన్ని తట్టిలేపేవారు... నా తండ్రి అనుభవం నాకు తెలుసు. ఈయన... ఈయన ...." సాగర్ కంఠంలో ఒణుకు...

అరచేతుల్లో కదలిక... మెల్లిగా మూసుకున్న కళ్ల రెప్పలమీద ముడతలు... తెరిచిన కళ్లల్లో వెలుతురు అర్థమైంది సాగర్‌కు ... తను సక్సెస్ అని....

" మీరు మాకు కావాలి బాబుగారు... మీరు మాకోసం బ్రతకాలి..."చాలా ఎమోషనల్‌గా అన్నాడు.

కృష్ణమాచార్య ""విసుగు" అనే మృత్యువును దాటి, "గుర్తింపు" అనే కొత్త జీవితంలోకి అడుగు పెట్టాడు...

* * *

తండ్రి పేరుతో ప్రారంభించబోయే యాక్టింగ్ స్కూలుకోసం ప్రాజెక్ట్ రిపోర్ట్ గురించి చర్చిస్తున్నాడు సాగర్- ఆ సాయంత్రం...

అతనిలోని బిజినెస్‌మాన్ లాభనష్టాలు బేరీజు వేస్తున్నాడు. మామూలుగా...

కానీ, అతనిలోని 'మనిషి' ఆలోచిస్తున్నాడు...

కృష్ణమాచారిగారి ఎదురుగా తను మాట్లాడిన మాటలు... అవి పూర్తిగా నిజమా? అబద్ధమా? అందులో నిజాయితీ ఎంత?!

ఒకరకమైన ఓదార్పుతో ప్రారంభించిన తను ఎక్కడ, ఎప్పుడు, ఎలా ఇన్‌వాల్వ్ అయ్యాడు?! తన జీవితానికి, ప్రవర్తనకు మధ్య ప్రవేశించిన ఆ నిజాయితీ భావం ఏమిటి? ఎలా ఆ భావన ఆయనను బ్రతికించింది?! ఆలోచిస్తూనే ఉన్నాడు సాగర్.

* * *

"మనందరం నటులమే... ప్రతిరోజూ ప్రతి ఒక్కళ్లదగ్గరా ప్రతిక్షణం నటిస్తూనే ఉంటాము... దీనిని గుర్తించరు... అంతే ... ప్రతి మాట వెనక, నిట్టూర్పు వెనక... స్పందన ఉంటే... దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రససిద్ధి అర్థమైతే, మనం మనంగా బ్రతుకుతాము"

యాక్టింగ్ స్కూలు ప్రిన్సిపాల్ కృష్ణమాచారి గారి స్వాగతోపన్యాసం...

గట్టిగా చప్పట్లు కొట్టాడు సాగర్.. టపటప కొన్ని వందల కరతాళ ధ్వనులు...

అతను చేసిన గొప్ప పనికి ఏ ఆకాశదేవతలో దీవించి ఇచ్చినట్లు... ఈ మధ్య అతను ధ్యాన్న స్థితికి వెళ్లగలుగుతున్నాడు.. తనను ఆ 'లో తలుపు' తెరిపించిన శక్తి పేరేమిటో అతనికి అర్థమౌతున్నది కానీ చెప్పలేడేమో... ★

**శ్రీమతి జలంధర**

*మనో విశ్లేషణ కు విశేష ప్రాధాన్యం యిస్తూ రచనలు చేసే రచయిత్రులలో ప్రముఖులు. కథ రాసినా, నవల రాసినా అది కాలక్షేపం కోసం అన్నట్లు కాకుండా పఠిత చైతన్య భావాలు రగిలించేలా వుండాలని ఆశిస్తూ రచనలు చేస్తారు. శ్రీమతి జలంధర తండ్రిగారు డా॥ గాలి బాలసుందరరావు, ఆయన సోదరి ప్రసిద్ధ రచయిత్రి 'లత' (డాక్టర్ తెన్నేటి హేమలతాదేవి) సాహితీ రంగంలో చేసిన కృషి చదువరులకు విదితమే. భర్త శ్రీ చంద్రమోహన్ ప్రముఖ చలన చిత్రనటులు.*